# నిలువుటద్దం

నేను రోడ్డు దిగి కాలిబాట మీద నడుస్తున్నాను. అప్పుడే సూర్యుడు పడమటి కొండల్లోకి దిగిపోతున్నాడు. ఆకాశం అంతా నీలం రంగు పులుముకొని ఉన్నా పడమటి దిశ గులాబీలు పరచినట్లు ఎర్రగా ఉంది. కాలిబాటకు అటూ ఇటూ పంటపైర్ల పచ్చదనం, ఆ పొలాలమీదుగా మందమందంగా వీస్తున్న మలయమారుతం.

ఇక్కడే ఒక చెట్టుకింద కూర్చుని సేద తీర్చుకోవాలన్న కోరిక కలిగింది. కాని అందుకు అవకాశం ఏది? దేనికైనా నోచుకొని ఉండాలి.

మనిషి అన్నవాడు ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తే విధిగా జ్ఞాపకం వచ్చే విషయాల్లో అతని బాల్యం ఒకటి. ఈ దశలో మానవుడు తన సన్నిహితుల ప్రేమను తప్పక చవిచూస్తాడు. అందువల్ల ఆప్రేమ అతని హృదయంలో చెరగని ముద్ర వేసుకుంటుంది.

క్షణం తీరిక లేకుండా డబ్బు సంపాదించడంలో నిమగ్నమై, ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటూ గడుపుతున్న నాకు అప్పుడప్పుడు నా చిన్ననాటి రోజులు గుర్తుకొచ్చేవి. రెక్కలు కట్టుకొని ఒక్కమారు అక్కడకు వెళ్ళి బాల్య స్నేహితుల్ని కలుసుకోవాలని, నేను చదువుకున్న బడి, తిరిగిన చోట్లను, అడిన స్థలాలను చూడాలనీ కోరికకలిగేది. ఇంతకాలానికి వీలు చూసుకొని ఇక్కడకు రాగలిగాను.

ఈ ప్రాంతానికి వచ్చానన్న మాటేగాని, ఏరీ ఆనాడు కలసి చదువుకొని ఆడుకున్న వాళ్ళు? అన్నీ కొత్త ముఖాలు. గోపాలం మాస్టారు మాత్రం మిగిలి ఉన్నారు.

నేను వచ్చి ఇంకా రెండు రోజులైనా కాలేదు, ఆఫీసు మేనేజరు 'అర్జెంటుగా రావలసింది' అంటూ పంపించిన టెలిగ్రాం అందింది.

ఎలాంటి పరిస్థితులలోనూ వారం పది రోజుల పాటు నా ఉనికిని మరిచిపోయి, అక్కడి వ్యవహారాలు స్వయంగా చూసుకోమని చెప్పే వచ్చాను. ఎలాంటి చిక్కు సమస్య లొచ్చినా పదివేల రూపాయలు ఖర్చు చేయడానికి వెనుదీయవద్దని మరీ మరీ హెచ్చరించాను. అయితే అతను ఈ టెలిగ్రాం ఎందుకిచ్చాడు? ఏ వ్యవహారమైనా పీకల మీదకు వచ్చిందా?

టెలిగ్రాం ఆఫీసు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. అయినప్పటికీ దాన్ని డెలివర్ చేయడానికి వారికి ఎనిమిది గంటలు పట్టింది. ఢిల్లీలాంటి మహానగరాలతో పోల్చి చూస్తే

ఈ పల్లెటూళ్ళు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ప్రభుత్వం చేపట్టిన పథకాలు ఏమౌతున్నాయి? ఈ శతాబ్దం అంతానికైనా వీరి స్థితిగతులు మారుతాయా?

నేను వడివడిగా నడుస్తున్నాను. రైలు వచ్చేవేళ అయిపోయింది. నా అదృష్టం బాగుండి రైలు పది పదిహేను నిముషాలు ఆలస్యంగా వస్తే నేను రైలు అందుకోగలను.

కాని సర్వసాధారణంగా సమయానికి రాని రైలు ఆ రోజు సరిగ్గా సమయానికి వచ్చింది. నా కళ్ళముందే పెద్దగా కూత కూస్తూ వెళ్ళిపోయింది. అప్పటికి నేను స్టేషనుకి పావు కిలోమీటరుదూరంలో ఉండిపోయాను.

ఏదో పీకలమీద వ్యవహారం అయితేనే కాని అతను టెలిగ్రాం ఇచ్చేవాడు కాదు. సేల్సు టాక్సు లేదా ఇన్‌కంటాక్సు వాళ్ళ దాడా? ఎక్సైజ్ వాళ్ళకు దొంగ పద్దు పుస్తకాలు దొరికిపోయాయా?

కష్టపడి సంపాదిస్తున్న సొమ్ము, ఎంతో తెలివి ఉపయోగిస్తేనే ప్రభుత్వం కళ్ళు కప్పి నాలుగు డబ్బులు వెనకేయగలం, అప్పటికీ మా లావాదేవీలతో సంబంధం ఉన్న అందరికీ ఇవ్వవలసినది ఇస్తూనే ఉన్నాం. మరి ఏం జరిగింది?

వెంటనే వెళ్ళాలి. కాని రైలు వెళ్ళి పోయింది.

అది నాకు జన్మనిచ్చిన ఊరు కాకపోతే రిక్షాసౌకర్యమైనా లేని ఆ ఊరిని శపించి ఉండేవాడిని.

ప్లాట్‌ఫారం ఖాళీగా ఉంది. పెళ్ళి అయిపోయిన తరువాత ఆడపెళ్ళి వారి ఇల్లులా కళావిహీనంగా ఉంది.

నడకను మరిచిపోయిన నా కాళ్ళు నొప్పులు పుట్టాయి. స్టేషను మాస్టరు రూంకి దగ్గరలో ఉన్న సిమెంటు బెంచీమీద చతికిలపడ్డాను. ఉదయంవరకు రైలు లేదు. ఈ రాత్రి అంతా శవజాగారమే!

ఇంగ్లీషు వారపత్రిక తీశాను. ఐతే మనసులో అలజడివలన చదవలేకపోయాను.

బండ్ల రాకపోకల బోర్డు కనుపించింది. గుడ్డిలో మెల్ల. మరో రెండు గంటల్లో ఎక్స్‌ప్రెస్ ఉంది. ఈ ఊళ్ళో ఎక్స్‌ప్రెస్‌లు ఆగుతాయని నా కంతవరకూ తెలియదు.

మానవ స్వభావం వింతగా ఉంటుంది. ఈ ప్రాంతంలో ఒంటరిగా ప్రకృతి ఒడిలో గంటల తరబడి గడపాలనుకున్నాను. ఇప్పుడు అలాంటి చోటే రెండు గంటలు ఎలా గడపటం అని బాధపడుతున్నాను.

అంత కంతకూ ఆకాశం మలినమైంది. వెండి అంచులు మాయమై నల్లని సిరా ఒలక పోసినట్లు నల్లబడి పోయింది. ఆకాశంలో చంద్రుడు మేఘాలతో దోబూచులాడుతున్నాడు.

నక్షత్రాలు పూలగుత్తుల్లా ఆకాశ మంతటా పరుచుకున్నాయి. చిన్న తనంలో అమ్మమ్మ చూపించే సప్త ఋషులు అరుందతి నక్షత్రాన్ని చూడాలని ప్రయత్నించేను.

ఎక్స్‌ప్రెస్ ఇప్పుడు ఎక్కడ ఉందో... అది సరియైన వేళకు వస్తుందా?

ఆ స్టేషనులో నాతోపాటు మరో వ్యక్తి ఉన్నాడు. అతను స్టేషను మాస్టరు. చిన్నతనంలో సాయంత్రం కాగానే మేం నలుగు రైదుగురం ఈ స్టేషనుకి వచ్చే వాళ్ళం. ఫోనులో మాట్లాడాలనే కోరిక ఉండేది. స్టేషను మాస్టర్ని బ్రతిమాలే వాళ్ళం. అతను ఏనాడూ అనుమతించలేదు. అతను ఫోనులో మాట్లాడుతూ ఉంటే ఆశగా వింటూ తృప్తి పడేవాళ్ళం.

ఆ రోజులకీ, ఈ రోజులకీ ఎంత తేడా?

ఈ రోజు నా ఆఫీసు లోనూ, ఫాక్టరీలోనూ, ఇంట్లోనూ ఫోనులన్నాయి. మాటి మాటికి వచ్చే కాల్సు రిసీవ్ చేసుకోవడానికి విసుగు. అయినా అందులో లాభించేవి ఉంటాయి కాబట్టి విధిగా వినవలసి వస్తోంది.

రైలు విషయం స్టేషను మాస్టర్ని అడగాలి. లేటుగా వచ్చినా దాని కోసం నిరీక్షిస్తూ కూర్చోవలసిందే నని నాకు తెలుసు.

స్టేషను మాస్టరు ఎవరితోనో ఫోనులో మాట్లాడుతున్నాడు. గుమ్మం దగ్గరకు వెళ్ళి నేనునిల్చున్నాను. అతను నన్ను గమనించలేదు. ఏకాగ్రంగా అతను మాట్లాడుతున్నాడు. అది అతని డ్యూటీకి సంబంధించిన సంభాషణ కాదు. అవతలి వ్యక్తి అతని స్నేహితుడో, బంధువో అయి ఉంటాడు. అందుకే అతను తీరికగా స్వవిషయాలు ముచ్చటిస్తున్నాడు. అతను ఇంత వేగిరం ఫోను కింద పెట్టేలా లేడు. అతడిని డిస్టర్బ్ చేసి లాభం లేదు.

తిరిగి సిమెంటు బెంచీమీద కూర్చున్నాను. "సింహాచలం!" స్టేషను మాస్టరు ఎవర్నో పిలిచాడు.

సింహాచలం! ఆ పేర్లో వింత లేదు. ఇక్కడకు దగ్గరిలోనే సింహాచలం కొండమీద నృసింహస్వామి వారు వెలిసి ఉండడం వలన చాలా మందికి సింహాచలం అనే పేరు ఉంటుంది.

టక టక శబ్దం చేసుకుంటూ స్టేషను వెనుక భాగం నుంచి ఒక శాల్తీ వస్తూ కనిపించింది. నల్లని డ్రెస్. చేతిలో ఎరుపు, ఆకుపచ్చ జండాలు ఉన్నాయి. పాపం కుంటివాడు కాబోలు, చంక కర్ర సహాయంతో నడుస్తూ వచ్చాడు.

ఏ లారీ ప్రమాదంలోనో కాలు విరిగిపోయిఉంటుంది. లేదు రైలు కిందపడి కాలు పోగొట్టుకొని ఉంటాడు.

"నేను భోజనానికి వెళ్తున్నాను. బండి వచ్చే పక్షంలో గంట కొట్టు" అన్నాడు స్టేషను మాస్టరు.

అప్పుడే సింహాచలం దృష్టి నా మీద పడింది.

"ఏ ఊరు బాబూ? "

"ఢిల్లీ"

"ఢిల్లీ వా! ఇక్కడి కెలా వచ్చారు?"

ఆ ప్రశ్న ఆశ్చర్యంగా తోచలేదు. నేను మా ఊర్లో ప్రవేశించింది లగాయితూ, రైలుకి బయలుదేరి వస్తున్నంత వరకు కనిపించిన ప్రతిఒక్కరూ వేసిన ప్రశ్న అదే. 'ఎవరి తాలూకు?' 'ఏం పనిమీద వచ్చారు?' 'ఎవ రింటికి బాబూ?'

ఈ సింహాచలమూ మరి అలాంటి వాడే.

"మాది ఈ పక్క గ్రామమే."

"బాబూ! తమరిది ఢిల్లీ అంటున్నారు. నా చిన్ననాటి స్నేహితుడు రామకృష్ణ అక్కడే ఉంటున్నాడు. అబ్బో, ఇప్పుడు అతడు లక్షాధికారట. మీకు కాని తెలుసా?" అడిగాడు.

అతని అమాయకత్వానికి నవ్వూ వచ్చింది, అతని ప్రశ్న నాకు ఆశ్చర్యమూ కలిగించింది.

ఢిల్లీ కుగ్రామమా? రామకృష్ణ అన్న పేరుగల వాళ్ళు ఎంద రున్నారో? పల్లెటూళ్ళలోలా ఒకరి గురించి మరొకరికి తెలుస్తుందా? అమాయకుడు!

అయితే నా పేరు రామకృష్ణే, అతను నా గురించే వాకబు చేస్తున్నాడా?

"ను వ్వెప్పుడైనా ఢిల్లీ చూశావా?"

"ఒకమారు ఢిల్లీ వెళ్ళాను"

"మరైతే నీ స్నేహితుడిని కలవలేక పోయావా?" కావాలనే అడిగాను.

"అంత అదృష్టమా? పంజాబు వెళ్తూ ఒక రోజు ఢిల్లీలో ఉన్నాను, కాని బారెక్ నుంచి బయటకు పోనివ్వలేదు."

సింహాచలం!

ఇంతవరకూ సింహాచలాన్ని పోల్చలేకపోయాను. స్మృతి పథంలో అతని జ్ఞాపకం ఎప్పుడో మసకబారింది. ఇప్పటి ఈ ఆకారంలో అతన్ని పోల్చుకోలేక పోయానంటే అందులో ఆశ్చర్యం లేదు. వాడూ మాతో పాటే అయిదో తరగతి వరకు చదివాడు. చాలా తెలివిగల వాడు. ప్రతీ పరీక్షలోను ప్రథమస్థానం వాడిదే. పై చదువులు చదివి ఉంటే వాడీనాడు కలెక్టరై ఉండేవాడు. కాని వాడి దురదృష్టం కొద్దీ ఒక రైతు కూలీ ఇంట్లో పుట్టాడు.

"ఈ చదివింది చాలు. బుగత గారింటిలో కమతానికి కుదురుకో" అన్నాడు వాడి తండ్రి. సింహాచలానికి ఆ పని ఎంతమాత్రం ఇష్టం లేదు. తండ్రి బలవంతం చేశాడు. ఒకనాడు

వాడు ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి పారిపోయాడు." అతని తండ్రి ఏడ్చాడు.

"నాలుగు రోజులు పోతే వాడే తిరిగివస్తాడు" అంటూ అతనికి ఊరి వాళ్ళు నచ్చచెప్పారు. అయినా సింహాచలం జాడ ఎవరికీ తెలియరాలేదు."

వాడేనా వీడు?

"సింహాచలం! ఆ రామకృష్ణను నేనే" అన్నాను సంతోషంగా.

సింహాచలం నమ్మలేకపోయాడు.

"సింహాచలం ! ఇంటినుంచి అలా ఎందుకు పారిపోయావు? ఆ తరువాత ఎక్కడ ఉన్నావు? ఈ కాలు ఎలా విరిగిపోయింది. ఇక్కడి కెప్పుడొచ్చావు?"

"అబ్బో అన్ని ప్రశ్నలా బాబుగారు? అదంతా ఒక పెద్ద కథ" అన్నాడు నిట్టూరుస్తూ.

సింహాచలానికి ఆ విషయాలు చెప్పాలన్న ఆసక్తి ఉన్నట్లు కనిపించలేదు. నాకు తెలుసుకోవాలని ఉంది.

"సింహాచలం! నీవు నన్ను మన్నించాల్రా? మనం బాల్య స్నేహితులం. ఒరే అంటే ఒరేయ్ అనుకునే వాళ్ళం గుర్తులేదా?"

"ఆ రోజులు వేరు బాబుగారు! నక్క ఎక్కడ నాకలోకం ఎక్కడ? తమరు శ్రీమంతులు. నేనిదిగో ఇలా ఉన్నాను" అన్నాడు తలదించుకొని. "యుద్ధం భయంకరంగా ఉంటుంది. సైనికుడి హృదయం శిల లాంటిది. శత్రువులను చీల్చి చెండాడాలనేదే అతని ధ్యేయం. 1965 లో అకారణంగా పాకిస్థాన్ వాళ్ళు మనమీద కయ్యానికి కాలు దువ్వారు. యుద్ధానికి కైనా ఒక నీతి ఉంది. సామాన్య జనం నివసించే గ్రామాల మీద, ఆసుపత్రుల మీద, స్కూళ్ళ మీద బాంబులు వేయకూడదు. కేవలం సైనికులనే కాల్చి చంపే అధికారం ఉంది. అయినా వాళ్ళు అధర్మయుద్ధానికి అకారణంగా పాల్పడ్డారు.

"అప్పుడు మా దళాన్ని పంజాబ్ సెక్టరుకి పంపారు. విజయమో, వీరస్వర్గమో అన్న ఉత్సాహంతో కదన భూమిలో అడుగుపెట్టాను. కొన్ని రోజులు హోరా హోరీ యుద్ధం జరిగింది.

ఒక రోజు మా కంపెనీ పాకిస్థాను భూమికి అతి సమీపంలోనికి చొచ్చుకుపోయింది. అక్కడ భారీ ఎత్తున శత్రు సైనికులు దేరా వేసి ఉన్నారు. ఆ స్థావరాన్ని నాశనం చేస్తే పాకిస్థానుకి భారీ నష్టం. వాళ్ళు తోక ముడిచి వెనక్కు వెళ్ళిపోవలసి ఉంటుంది.

అయితే మా కేప్టెనూ, ఒక సుబేదారూ, నేనూ చాలా ముందుకి చొచ్చుకుపోయాం. తక్కిన వాళ్ళు చాలా వెనకగా ఉండిపోయారు. అది గ్రహించేసరికి అనర్థం జరిగిపోయింది. మేం పాకిస్థాన్ ఆవరణలో ఉన్నాం. చుట్టూ శత్రువులు.

చీకటి పడింది. మళ్ళీ వెనక్కు పోవడానికి అవకాశాలు లేవు.

గత్యంతరం లేక మేం ముగ్గురం ఒక గుమ్మిలో దాగున్నాం. ఆ రాత్రికి ఎలాంటి భయంలేదు. కాని తెల్లవారితే మా ఉనికిని వారు పసిగడతారు. ప్రాణాలతో బయటపడడం కలలోని మాట.

ఎటూ తోచని స్థితి. యుద్ధ రంగంలో ప్రవేశించిన వాడు తన ప్రాణాల కోసం వెనుదీయడు. కాని పాకిస్థానీయుల వ్యూహం చాలా పకడ్బందీగా ఉంది. ఆమెరికనుల పాటాన్ టాంకులు మన దేశపు సరిహద్దుల్ని ఇట్టే ధ్వంసం చేస్తాయి. అందువలన దానికి తగిన ఉపాయం ఆలోచించాలి. వారికి అవకాశం ఇవ్వరాదు.

ఇదే విషయాలు కేప్టెను, సుబేదారు అతిరహస్యంగా చర్చించుకుంటున్నారు. మాలో ఎవరైనా వెనక్కు వెళ్ళి వెంటనే యుద్ధ సన్నాహాలు చేయించాలి. వెనక్కు వెళ్ళడం అంత తేలిక కాదు.

సుబేదారు సలహా అయితే ఇచ్చాడు కాని అతనికి ధైర్యంలేకపోయింది. కేప్టెనూ జంకిపోయాడు. నా కళ్ళ ముందు రేపు జరుగబోయే వినాశం కనిపిస్తున్నది. వారు నాకు ఆజ్ఞ ఇచ్చి ఉంటే తక్షణం బయలుదేరేవాడిని. కాని వాళ్ళు రిస్కుతీసుకో దలచలేదు. బహుశా బ్రతికి ఉంటే బలుసాకు తినవచ్చు ననుకున్నారేమో?

నా లాంటి సిపాయి అధికారులకు ఎలాంటి సలహాలూ ఇవ్వకూడదు.

అయినప్పటికీ నేను చూస్తూ ఊరుకోలేకపోయాను. ఈ యుద్ధంలో విజయంసాధించాలంటే మా సైన్యం వారి స్థావరాలను ధ్వంసం చేయాలి. ఉపేక్షిస్తే ఇద్దరు అధికారులు అనవసరంగా ప్రాణాలు కోల్పోతారు. అందుకే తెగించి నేను వెనక్కు వెళ్ళి తగిన సహాయం తీసుకు వస్తానని చెప్పాను. నా కప్పుడు ప్రాణభయం లేకుండాపోయింది.

కేప్టెను నావంక ఆశ్చర్యంగా చూశాడు. అతనికి నా మాటల మీద నమ్మకం లేదు. నేను పట్టుబడిపోతే రేపటి ఉదయం వరకూ పోవనుకున్న వారి ప్రాణాలు ఈ రాత్రే పోతాయి.

"అది దుస్సాహసం. వాళ్ళను తప్పించుకొని వెళ్ళగలవా? నీకు ప్రాణంమీద తీపి లేదా? వద్దు" అన్నాడు.

నాకు అదొక సవాలుగా తోచింది. నా మీద అతనికి నమ్మకంలేదా? నేను అసహాయుడ్ని. అతను అనుజ్ఞ ఇవ్వందే వెళ్ళలేను.

అతను ఏమనుకున్నాడో చివరకు నన్ను పంపించడానికి అంగీకరించాడు.

"రైట్! నీ లాంటి వీరుల మూలంగానే భారతదేశం కీర్తి ప్రతిష్ఠలు నలుదెసలా వ్యాపిస్తాయి. నే నొక చీటీ ఇస్తాను. దాన్ని కల్నల్‌గారికి ఇవ్వు. ఆ చీటీ శత్రువుల చేతికి చిక్కకూడదు." అతను ఆ చీకట్లోనే ఒక కాగితం మీద ఏదో రాసి ఇచ్చాడు.

శరవేగంతో నేను బయటపడ్డాను. సరియైన దారి తెలియదు. అంతా చీకటిమయం. ఎక్కడ శత్రు సైనికులు అడ్డగిస్తారో తెలియదు. ముళ్ళ కంపల్లో చిక్కుకుంటూ, బురదలో దిగబడుతూ పరుగెడుతున్నాను. నేను నా గమ్యం చేరుకోగలనో, లేదో తెలియదు. ఎండుటాకుల మీద కాళ్ళు పడితే ఆ చప్పుడుకు అవతలి వాళ్ళు నా మీద విరుచుకుపడతారు. అప్పుడప్పుడు శవాలను మట్టుకుంటూ నడుస్తున్నాను.

అలా కొంతసేపు పరుగెత్తి మన సరిహద్దుకి అతిచేరువకి సమీపించాను. ఇంకా కొంతదూరం వెళ్తే మరెలాంటి భయం ఉండదు. కాని అంతలోనే "ఎవరూ?" అంటూ బిగ్గరగా ఎవరో అరిచారు. "కదలకు - కదిలితే కాల్చేస్తాను" అని బెదిరించారు. ఆ వెనుకనే తుపాకి పేలుళ్ళు ఒకటి... రెండు.. మూడు - అలా ఎన్నో గుళ్ళు నా పక్క నుంచి దూసుకుపోతున్నాయి. నేనూ వెనుతిరిగి తుపాకీ పేలుస్తూ, ఇంకా వేగంగా పరుగెత్త సాగాను. అయితే ఒక గుండు నా కాలిలో దిగబడింది. అప్పటికి నేను మన భూభాగం లోనికి వచ్చాను. అవతలి వాళ్ళ తుపాకి పేలుళ్ళు వినిపించనంత ముందుకి వచ్చాను.

కల్నల్ గారు సీనియరు ఆఫీసర్లతో మర్నాటి యుద్ధ వ్యూహం గురించి రహస్య సంప్రతింపులు చేస్తున్నారు. లోనికి వెళ్లేందుకు నాకు అనుమతి లభించలేదు. అయినా ఎవరి ఆజ్ఞను పాటించకుండా లోనికి ప్రవేశించారు.

నా రాకకు కల్నల్‌గారు ముందుగా మండిపడ్డారు. నే నిచ్చిన కాగితం చదివి "శభాష్! సిపాయీ! వీరుడి వంటే నీవే! నీ ధైర్యసాహసాలను మెచ్చుకుంటున్నాను. నేనే కాదు, పూర్తి భారతదేశం నీ శౌర్యాన్ని శ్లాఘిస్తుంది. ఈ యుద్ధం ముగిసిన తరువాత నీకు మంచి బహుమతి లభిస్తుంది" అన్నారు.

సింహాచలం అంతవరకు చెప్పి ఆగిపోయాడు. ఫోను గణగణ మోగింది. అతను కర్ర సహాయంతో రూం లోనికి వెళ్ళి ఫోనులో ఏదో మాట్లాడాడు.

ఆ తరువాత ఏం జరిగిందో నాకు వినాలన్న కుతూహలం ఉంది.

అతను మళ్ళీ వచ్చాడు.

"ఆ తరువాత?"

"ఆ తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు. నేను అక్కడ పడిపోయానట.

వెంటనే యూనిట్ డాక్టర్ దగ్గరకు నన్ను తీసుకుపోయారట. నా కాలు తీసేశారు. ఆ రాత్రే కల్నల్ గారు పాకిస్థాన్ స్థావరం మీద ముట్టడి జరిపారు. విమాన దళాలు కూడా యుద్ధంలో పాల్గొన్నాయట. పాకిస్థాన్ స్థావరాన్ని పూర్తిగా దహనం చేశారట. చాలా పాటన్ టాంకులు మన స్వాధీన మయ్యాయట" అన్నాడు.

"అంటే నీ ధైర్యం, తెగింపు వల్లనే మనం విజయం సాధించాం. ఔనా?" అన్నాను.

"ఇందులో నా ధైర్యం ఏముంది? నా స్థానంలో ఎవరున్నా వారు నాలాగే ప్రవర్తిస్తారు" అన్నాడు.

ఇది కొంతవరకూ నిజం కావచ్చు. కాని ఎవరూ కోరి పులి నోట్లో తలదూర్చరు. సింహాచలం అన్నదే సరియైనది అయితే కేప్టేను ఎందుకు తెగించలేదు? సుబేదారు తన కర్తవ్యాన్ని ఎందుకు విస్మరించాడు?

ఈ ప్రశ్నకు జవాబు అతి స్వల్పం.

యుద్ధబందీలుగా పట్టుబడినా ఎప్పుడో ఒకప్పుడు ముక్తి కలగవచ్చు. చూస్తూ చూస్తూ ఎవరు మాత్రం ప్రాణాలు పోగొట్టుకోవాలనుకుంటారు?

"ఆ తరువాత కల్నల్ గారన్నట్లు నీకు మంచి బహుమతులు లభించి ఉంటాయి" అన్నాను.

"కేప్టెన్ గారికి పరమ విశిష్ట చక్ర లభించింది. సుబేదారుకి ప్రమోషను దొరికింది" అన్నాడు.

"మరి నీ సంగతి చెప్పవే?"

"నాకు వెయ్యి రూపాయలు నగదు బహుమానం, ఒక ప్రశంసా పత్రం ఇచ్చారు. ఈ ఉద్యోగం ఆ కారణంగా దొరికినదే" అన్నాడు.

అన్యాయం! నా మనసు ఆక్రోశించింది. ఎంతటి భేదభావం!

"ఇంతేనా? ఇదా నీ ధైర్యానికి ప్రతిఫలం? దేశం నీ కిచ్చింది ఇదా?" అన్నాను.

"దేశం నా కే మిచ్చింది అని కాదు ఆలోచించవలసింది. దేశానికి నే నేం చేశాను - అని. తల్లికి మనం సేవ చేస్తున్నది ప్రతిఫలాన్ని ఆశించా?" అన్నాడు.

అతనికి ఎలాంటి బాధా ఉన్నట్లు తోచలేదు. ఈర్ష్యాసూయలకు అతీతుడా?

అతను ఒక నిరుపేద కాక సంపన్న కుటుంబంలో పుట్టి, పలుకుబడి కలవాడైతే, అతన్ని అందలం ఎక్కించే వారు కాదా?

స్టేషనుమాస్టరు పిలుపు విని సింహాచలం వెళ్ళిపోయాడు.

దేశంకోసం ఇంత త్యాగం చేసిన అతనిముందు నెనెంతటి అల్పుడిని!

- ఆంధ్రప్రభ - సచిత్రవారపత్రిక,
**12 డిసెంబర్ 1990**